క్లుప్తంగా

కొనసాగుతున్న వేసవి శిక్షణ తరగతులు



క్రోసూరు: మండల కేంద్రంలోని గ్రంథాయలంలో వేసవి శిక్షణ తరగుతులు కొనసాగుతున్నాయి. ఈ నెల 7వ తేదీ వరకు జరిగే శిక్షణ తరగతుల ద్వారా విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జ్ఞానాన్ని పెంపొందించుకుంటున్నట్లు గ్రంథాయల అధికారి వై.వీరాంజమ్మ సోమవారం తెలిపారు. విద్యార్థులు ప్రతిరోజు పుస్తక పఠనం, కథలు చెప్పటం, క్యారమ్స్, చెస్ వంటి పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ముగింపు రోజున బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

కాశీ విశ్వేశ్వరస్వామికి విశేష పూజలు

నకరికల్లు: మండలంలోని నర్సింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి సోమవారం ప్రీతిపాత్రం కావడంతో అర్చకులు కొమ్మువరపు పవన్‌కుమార్‌శర్మ స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొన్నారు.

రేపు పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలు

నరసరావుపేట ఈస్ట్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 5వతేదిన శ్రీనాథ సాహితీ పరిషత్, ఆంధ్ర చైతన్య గ్రూప్ సంయుక్త ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి సోమవారం తెలిపారు. పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో 5వతేదీ ఉదయం 10 గంటలకు పోటీ ప్రారంభమవుతుందని వివరించారు. పోటీలో పాల్గొనేందుకు 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. పర్యావరణాన్ని ప్రతిబింబించేలా పర్యావరణ పరిరక్షణ, వాతావరణ కాలుష్యం, మొక్కల పెంపకం, వాహనాల రద్దీ కాలుష్యం అంశాలలో ఏదో ఒక అంశంపై విద్యార్థులు చిత్రం గీయవచ్చన్నారు. డ్రాయింగ్‌కు సంబంధించిన సామాగ్రిని విద్యార్థులే సమకూర్చుకోవాలన్నారు. విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

98 శాతం పెన్షన్ల పంపిణీ



నాదెండ్ల: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో వైఎస్సార్ పెన్షన్ కానుక - సామాజిక భద్రతా పెన్షన్లు మూడోరోజు సోమవారం నాటికి 98 శాతం పంపిణీ చేశారు. మండల పరిధిలో 9659 మంది లబ్దిదారులకు గాను రూ.2,86,49,000లు పెన్షన్ పంపిణీ చేయాల్సి ఉండగా, ఇందులో 2440 మందికి గాను పెన్షన్ నగదును వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు తెలిపారు. మిగిలిన 7219 మందికి సచివాలయ సిబ్బంది శనివారం నుండి పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మాచర్ల రూరల్: ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీ కొట్టి ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కొత్తపల్లి జంక్షన్, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలలోకి వెళితే ఒంగోలు పట్టణానికి చెందిన నేలం శివ హైదరాబాద్‌లో బేల్దారి పనిచేస్తూ స్వగ్రామమైన ఒంగోలుకు ద్విచక్ర వాహనంపై వస్తున్న సమయంలో మార్గమధ్యంలోని పెట్రోల్ బంకు వద్ద ఆగి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్నాడు. తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే చనిపోయాడు. ఈ మేరకు విజయపురిసౌత్ ఎస్‌ఐ పట్టాభి రామారావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

200 మంది పోలీసులతో భారీ బందోబస్తు : సీఐ నరేష్

వెల్దుర్తి: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాలలో శాంతిభద్రతలు కాపాడేందుకు 200 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు మాచర్ల రూరల్ సీఐ సురేష్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని సమస్యాత్మకమైన గ్రామాలలో ఎక్కువ మంది పోలీసులను బందోబస్తుకు నియమించామన్నారు. మండలంలోని 20 పంచాయతీల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ అనంతరం గ్రామాలలో సభలు, సమావేశాలతో పాటు బాణసంచా, ర్యాలీలు, డప్పు వాయిద్యాలు వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గ్రామాల్లో గుంపులు గుంపులుగా ఉండకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. ఏ పార్టీ గెలిచినా సోదరభావంతో కలిసి మెలిసి ఉండాలన్నారు. గొడవల వలన ఎలాంటి ప్రయోజనం లేదన్నారు.

ఆఖరి ఘట్టం.. అంతా సిద్ధం



నందిగామలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరిన ఉన్న ఓటర్లు(ఫైల్)

- నేడు వెలువడనున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు
- పకడ్బందీ ఏర్పాట్లలో అధికార, పోలీసు యంత్రాంగం
- 2019 ఫలితాలే ప్రతిబింబిస్తాయని వైఎస్సార్ సీపీ ధీమా
- దింపుడు కల్లం ఆశలతో చూస్తున్న తెలుగు తమ్ముళ్లు

సత్తెనపల్లి: కౌంటింగ్‌కు కేవలం కొన్ని గంటల సమయమే ఉంది. నరాలు తెగే ఉత్కంఠ, ఊపిరి సలపని ఒత్తిడి అందరూ టీవీలకే, మొబైల్ ఫోన్లకు అతుక్కుపోనున్నారు. సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక పట్టణం, నాలుగు మండలాలున్నాయి. 86.97 శాతం పోలింగ్ నమోదైంది. ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెలబడిన అనంతరం నియోజకవర్గంలో ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. పోలింగ్ రోజు అక్కడక్కడా ఈవీఎంలు మొరాయించడం వంటి స్వల్ప ఇబ్బందులతో పాటు అల్లర్లు, ఘర్షణలు చేటు చేసుకున్నాయి. ఇదంతా కొందరు అధికారులు, సిబ్బంది అవగాహన లేక పోవడంతోనే ఇబ్బందులు తలెత్తాయని అధికారులు ఓ నిర్ణయానికి వచ్చారు. ఎన్నికల ఫలితాలు ప్రకటించే టప్పుడు శాంతి భద్రతల సమస్యలు తలెత్తితే తీసుకోవాల్సిన భద్రతపై పోలీసులు దృష్టి పెట్టారు. నియోజకవర్గంలోని సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అందుకు అనుగుణంగా సాయుధ, పోలీసు బలగాలను మోహరించారు.

ప్రధాన పార్టీల మధ్యే పోటీ

సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రధాన పార్టీ అభ్యర్థుల మధ్యే పోటీ నడిచింది. వైఎస్సార్ సీపీ తరపు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, టీడీపీ నుంచి మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ తలపడ్డారు. మిగిలిన గుర్తింపు పొందిన పార్టీలతో పాటు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచినప్పటికీ అది నామ మాత్రమనే చెప్పాలి.

14 టేబుళ్లు... 20 రౌండ్లలో లెక్కింపు

సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ఓట్ల లెక్కింపు నరసరావుపేట సమీపం లోని కాకాని జేఎన్టీయూ కళాశాలలో మంగళవారం జరగనుంది. నియోజకవర్గంలో 2,10,500 ఓట్లు పోలయ్యాయి. వీరిలో పురుషులు 1,03,116 మంది, మహిళలు 1,07,381 మంది, థర్డ్ జెండర్స్ ముగ్గురు ఉన్నారు. కౌంటింగ్‌కు సంబంధించి మొత్తం 14 టేబుళ్లు ఏర్పాటు చేయగా.. 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ముగియనుంది. ముందుగా నియోజకవర్గంలోని ఉద్యోగులకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 1,926, ఇతర జిల్లాలకు సంబంధించిన ఉద్యోగులు 288 పోస్టల్ బ్యాలెట్లు, 85 ఏళ్ల పైబడిన వృద్దులు, పోలింగ్ కేంద్రం వద్దకు నడవలేని దివ్యాంగులు 255 మంది హోమ్ ఓటింగ్ వినియోగించుకున్నారు. వీరు కాక సర్వీస్ ఓటర్లు 281 మంది ఉండగా ఇప్పటి వరకు 75 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు. తొలుత ఈ ఓట్లను లెక్కించనున్నారు.

రౌండ్.. రౌండ్‌కి ఉత్కంఠ

సత్తెనపల్లి నియోజకవర్గంలో రౌండ్ల వారీగా లెక్కింపు ఇలా..

- 1వ రౌండ్‌లో 1-14 పోలింగ్ బూత్‌లలో 10,233 ఓట్లు లెక్కించనున్నారు. ఇందులో సత్తెనపల్లి మండలం కట్టావారి పాలెం, కంటెపూడి, కొమెరపూడి, నందిగామలు ఉన్నాయి.
- 2వ రౌండ్‌లో 15-28 పోలింగ్ బూత్‌లలో 10,071 ఓట్లు లెక్కించనున్నారు. ఇందులో నందిగామ, రామకృష్ణాపుం, గుడిపూడి, లక్ష్మీపురం, పెదమక్కెన, గర్నెపూడి, లక్కరాజుగార్లపాడు గ్రామాలున్నాయి.
- 3వ రౌండ్‌లో 29-42 పోలింగ్ బూత్‌లలో 11,935 ఓట్లు లెక్కించనున్నారు. ఇందులో లక్కరాజుగార్లపాడు, సత్తెనపల్లి టౌన్ ఉన్నాయి.
- 4వ రౌండ్‌లో 43-56 పోలింగ్ బూత్‌లలో 11,822 ఓట్లు లెక్కించనున్నారు. ఇవి సత్తెనపల్లి పట్టణ పరిధిలోకి వస్తాయి.
- 5వ రౌండ్‌లో 57-70 పోలింగ్ బూత్‌లలో 11,797 ఓట్లు లెక్కిస్తారు. ఇవి కూడా సత్తెనపల్లి పట్టణ పరిధిలోకి వస్తాయి.
- 6వ రౌండ్‌లో 71-84 పోలింగ్ బూత్‌లలో 12,734 ఓట్లు లెక్కిస్తారు. ఇందులో సత్తెనపల్లి టౌన్, గండ్లూరు, భీమవరం, అబ్బూరు, దీపాలదిన్నెపాలెం, పణిదం గ్రామాలున్నాయి.
- 7వ రౌండ్‌లో 85-98 పోలింగ్ బూత్‌లలో 10,416 ఓట్లు లెక్కిస్తారు. ఇందులో పణిదం, గుజ్జర్లపూడి, భట్లూరు, కట్టమూరు, గోరంట్ల, రెంటపాళ్ల గ్రామాలున్నాయి.
- 8వ రౌండ్‌లో 99-112 పోలింగ్ బూత్‌లలో 10,623 ఓట్లు లెక్కిస్తారు. ఇవి రెంటపాళ్ల, గోగులపాడు, పాకాలపాడు, కంకణాలపల్లి, వెన్నాదేవి, వావిలాలనగర్, భృగుబండ గ్రామాల పరిధిలోకి వస్తాయి.
- 9వ రౌండ్‌లో 113-126 పోలింగ్ బూత్‌లలో 10,344 ఓట్లు లెక్కిస్తారు. ఇందులో భృగుబండ, ధూళిపాళ్ల, రాజుపాలెం మండలం రెడ్డిగూడెం, మొక్కపాడు, బ్రాహ్మణపల్లి గ్రామాలున్నాయి.
- 10వ రౌండ్‌లో 127-140 పోలింగ్ బూత్‌లలో 10,732 ఓట్లు లెక్కిస్తారు. ఇవి రాజుపాలెం, చౌటపాపాయపాలెం ఆర్‌ఆర్ సెంటర్, చౌటపాపాయపాలెం, రాజుపాలెం ఆర్‌ఆర్ సెంటర్, కుబాద్పురం, అంచులవారిపాలెం పరిధిలోకి వస్తాయి.
- 11వ రౌండ్‌లో 141-154 పోలింగ్ బూత్‌లలో 10,439 ఓట్లు లెక్కిస్తారు. ఇవి కుబాద్‌పురం శివారు, కోటనెమిలిపురి, పార్వతిపురం, దేవరంపాడు, నెమిలిపురి, శ్రీనివాసనగర్, గణపవరం గ్రామాల పరిధిలోకి వస్తాయి.
- 12వ రౌండ్‌లో 155-168 పోలింగ్ బూత్‌లలో 11,893 ఓట్లు లెక్కిస్తారు. గణపవరం, బీరవల్లిపాయ, కొత్తపాలెం, బలిజేపల్లి, ఉప్పలపాడు, చల్లపల్లితండా, ఇనిమెట్ల, నకరికల్లు మండలం త్రిపురాపురం, గుండ్లపల్లి గ్రామాల పరిధిలో ఈ ఓట్లు ఉన్నాయి.
- 13వ రౌండ్‌లో 169-182 పోలింగ్ బూత్‌లలో 10,373 ఓట్లు లెక్కిస్తారు. గుండ్లపల్లి, బాలాజీనగర్, నరశింగపాడు, నకరికల్లు గ్రామాలు ఇందులో ఉన్నాయి.
- 14వ రౌండ్‌లో 183-196 పోలింగ్ బూత్‌లలో 10,857 ఓట్లు లెక్కిస్తారు. నకరికల్లు, శివాపురం, చల్లగుండ్ల ఇందులో ఉన్నాయి.
- 15వ రౌండ్‌లో 197-210 పోలింగ్ బూత్‌లలో 10,262 ఓట్లు లెక్కిస్తారు. చీమలమర్రి, చాగల్లు, కండ్లకుంట,రూపెనగుంట్ల, దేచవరం గ్రామాలు ఇందులో ఉన్నాయి.
- 16వ రౌండ్‌లో 211-224 పోలింగ్ బూత్‌లలో 9,821 ఓట్లు లెక్కిస్తారు. దేచవరం, రూపెనగుంట్ల, కుంకలగుంట, పాపిశెట్టిపాలెం ఇందులో ఉన్నాయి.
- 17వ రౌండ్‌లో 225-238 పోలింగ్ బూత్‌లలో 10,583 ఓట్లు లెక్కిస్తారు. ఇందులో జిల్లాపేటతండా, చేజర్ల, ముప్పాళ్ళ మండలం కుందురువారిపాలెం, గోళ్ళపాడు, లంకెలకూరపాడు, నార్నెపాడు గ్రామాలున్నాయి.
- 18వ రౌండ్లో 239-252 పోలింగ్ బూత్‌లలో 9,503 ఓట్లు లెక్కిస్తారు. ఇవి పలుదేవర్లపాడు, చాగంటివారి పాలెం, ముప్పాళ్ళ, కుంకావారి పాలెం, తురకపాలెం, దమ్మాలపాడు గ్రామాల పరిధిలో ఉన్నాయి.
- 19వ రౌండ్‌లో 253-266 పోలింగ్ బూత్‌లలో 9,581 ఓట్లు లెక్కిస్తారు. ఇందులో దమ్మాలపాడు, బొల్లవరం, రామకృష్ణాపురం, మాదల, రుద్రవరం గ్రామాలున్నాయి.
- 20వ రౌండ్లో 267-274 పోలింగ్ బూత్‌లలో 6,431 ఓట్లు లెక్కిస్తారు. ఇందులో రుద్రవరం, తొండపీ, ఇరుకుపాలెం, సత్తెనపల్లి టౌన్ రంగా కాలనీ ఉన్నాయి.

19 రౌండ్లలో పెదకూరపాడు ఫలితం

సార్వత్రిక ఎన్నికల సమరం తుది అంకానికి చేరుకుంది. 19 రౌండ్లలో పెదకూరపాడు నియోజకవర్గ ఫలితం తేలనుంది. ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. మంగళవారం నర్సరావుపేటలోని జేఎన్‌టీయూ కళాశాలలో జరిగే కౌంటింగ్ ప్రక్రియలో నేతల భవితవ్యం తేలనుంది. ఉదయం 11 గంటలకే విజేతపై ఒక అంచనా రానుంది.

- ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం
- మూడు గంటల్లో ఓ అంచనా
- పోస్టల్ బ్యాలెట్‌కు ప్రాధాన్యం
- గెలుపుపై వైఎస్సార్ సీపీ ధీమా



పెదకూరపాడు పోలీసుస్టేషన్ నుంచి నర్సరావుపేట కౌంటింగ్ కేంద్రానికి తరలిస్తున్న హోం ఓటర్ల బాక్స్‌లు

పెదకూరపాడు: పెదకూరపాడు నియోజకవర్గం పరిధిలో మొత్తం 266 కేంద్రాల్లో పోలింగ్ జరిగింది. ఇందుకు సంబంధించి 266 ఈవీఎంలను లెక్కించాల్సి ఉంది. వీటితో పాటు లోక్ సభ ఎన్నికల ఈవీఎంల లెక్కింపు ఇదే విధంగా జరుగుతుంది. అందుకుగాను మొత్తం 19 రౌండ్లలో కౌటింగ్ నిర్వహిస్తారు. కౌటింగ్ 14 టెబుల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కొక్క టేబుల్ వద్ద ఒక్కో కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంటుతో పాటు మైక్రో అబ్జర్వరు ఉంటారు. కౌటింగ్‌కు ఒక్కో ఈవీఎంకు 20 నుంచి 25 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రతీ టేబుల్ వద్ద ఆయా పార్టీలు ఏర్పాటు చేసుకున్న ఏజెంట్లు అందుబాటులో ఉంటారు.

మూడు గంటల్లో ఓ అంచనా..

పెదకూరపాడు నియోజకవర్గ ఎన్నికల లెక్కింపు ప్రక్రియ ఆరంభమైన తర్వాత మూడు గంటల్లో ఫలితాలు కొలిక్కి వస్తాయి. ఒక్కొక్క ఈవీఎం 20 నుంచి 25 నిమిషాలు పట్టే అవకాశం ఉండడంతో లెక్కింపు త్వరగానే పూర్తవ్వనుంది. పెదకూరపాడు నియోజకవర్గంలో మొత్తం 2,32,453 ఓటర్లలో.. 2,08,307 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 1,01,833 మంది పురుషులు 1,05,469 మంది మహిళలు, ఇతరులు ఐదుగురు ఉన్నారు. పురుషులు కంటే అధికంగా మహిళలే అధికంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో గెలుపు గుర్రాలను ఎంపిక చేయడంలో మహిళలదే కీలక పాత్ర పోషిస్తున్నారు.

నందిరాజుపాలెం మొదలు నెలమలికల్లుతో ముగింపు..

నియోజకవర్గంలో మొత్తం 19 రౌండ్లలో కౌంటింగ్ పక్రియ సాగనుంది. ముందుగా బెల్లంకొండ మండలం నందిరాజుపాలెంతో మొదలై... అమరావతి మండలం నెలమలికల్లుతో ముగిస్తుంది.

- మొదటి రౌండ్‌లో బెల్లంకొండ మండలం నందిరాజుపాలెం, నాగిరెడ్డిపాలెం, బెల్లంకొండ, గంగిరెడ్డిపాలెం, కొత్తపాలెం, వన్నాయిపాలెం, మాచాయసాలెం గ్రామాల పోలింగ్ బూత్‌లలో కౌంటింగ్ ప్రారంభమవుతుంది.
- 2వ రౌండ్‌లో ఆర్‌ఆర్ సెంటర్, చంద్రాజుపాలెం, కందిపడదు, పాపాయపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం, ఏమ్మాజిగూడెం పోలింగ్ బూత్‌లలో కౌంటింగ్ జరుగుతుంది.
- 3వ రౌండ్‌లో బెల్లంకొండ మండలం వెంకటాయపాలెంతో పాటు అచ్చంపేట మండలం మాదిపాడు, కంచుబోడుతండా, గింజుపల్లి, చల్లగరిగ, తాడువాయి, చింతపల్లి, పూట్లగూడెం, చెరుకుంపాలెం, కొత్తపల్లి పోలింగ్ బూత్‌ల కౌంటింగ్ జరుగుతుంది.
- 4వ రౌండ్‌లో కొత్తపల్లి, తాళ్లచెరువు, చామర్రు పోలింగ్ బూత్‌ల ఓట్లను లెక్కిస్తారు.
- 5వ రౌండ్‌లో చామర్రు, నీలేశ్వరపాలెం, చిగురుపాడు,రోకలిగుంటపాలెం, ఆర్‌ఆర్‌సెంటర్, కోగంటివారిపాలెం, అంబడిపూడి, కోనూరు పోలింగ్ బూత్‌ల ఓట్లు లెక్కిస్తారు.
- 6వ రౌండ్‌లో కోనూరు, కస్తల, ఓర్వకల్లు, రుద్రవరం, గ్రంధసిరి, వేల్పూరు, పెద్దపాలెం ఓట్లు లెక్కిస్తారు.
- 7వ రౌండ్‌లో పెద్దపాలెం, ఆర్‌ఆర్ సెంటర్, మిట్టపాలెం, కొండూరు, నిండుజర్ల, గ్రామాలతో పాటు క్రోసూరు మండలంలోని దొడ్లేరు, గ్రామంలోని ఒక బూత్ ఓట్లు లెక్కిస్తారు.
- 8వ రౌండ్‌లో క్రోసూరు మండలంలోని ఆవులవారిపాలెం, పెరికపాడు, హసానాబాద్, నాగవరం, గుడిపాడు, గరికపాడు, ఉయ్యందన ఓట్లు లెక్కిస్తారు.
- 9వ రౌండ్‌లో ఉయ్యందన, 88తాళ్ళూరు, పీసపాడు, పారుపల్లి, ఎర్రబాలెం, గ్రామాలతో క్రోసూరులోని కొన్ని బూత్‌లు ఓట్లు లెక్కిస్తారు.
- 10వ రౌండ్‌లో క్రోసూరు, అనంతవరం, అందుకూరు, బాలెమర్రు, విప్పర్ల గ్రామాల్లో పోలైన ఓట్లు లెక్కిస్తారు.
- 11వ రౌండ్‌లో ఊటుకూరు, బయ్యవరం, గ్రామాలతో పాటు పెదకూరపాడు మండలంలోని గారపాడు, లగడపాడు, కన్నెగండ్ల గ్రామాల పోలింగ్ బూత్‌ల్లోని ఓట్లు లెక్కిస్తారు.
- 12వ రౌండ్‌లో హుస్సేన్ నగరం, రామాపురం, బుచ్చయ్యపాలెం, పెదకూరపాడు ఓట్లు లెక్కిస్తారు.
- 13వ రౌండ్‌లో అబ్బరాజుపాలెం, చిన్నమక్కెన, లింగంగుంట్ల, పొడపాడు, ముస్సాపురం, పాటిబండ్ల, జలాల్‌పురం ఓట్లు లెక్కిస్తారు.
- 14వ రౌండ్‌లో జలాల్‌పురం, కంభంపాడు, బలుసుపాడు, కాశిపాడు, తమ్మవరం, 75త్యాళ్ళూరు ఓట్లు లెక్కిస్తారు.
- 15వ రౌండ్‌లో 75 త్యాళ్ళూరు గ్రామం పాటు అమరావతి మండలంలోని మునగోడు, జుపూడి, అత్తలూరు, పొందుగల, మల్లాది గ్రామాల ఓట్లు లెక్కిస్తారు.
- 16వ రౌండ్‌లో మల్లాది, దిగుడు, ధరణికోట, అమరావతి ఓట్లు లెక్కిస్తారు.
- 17వ రౌండ్‌లో అమరావతి, పెద్దమద్దూరు ఓట్లు లెక్కించనున్నారు.
- 18వ రౌండ్‌లో పెద్దమద్దూరు, వైకుంఠపురం, లింగాపురం, నరుకుళ్లపాడు, ఎండ్రాయి, చావపాడు గ్రామాల ఓట్లు లెక్కిస్తారు.
- ఇక ఆఖరి 19వ రౌండ్‌లో లేమల్లె, కర్లపూడి, ఉంగుటూరు, నెమలికల్లు, మండెపూడి గ్రామాల ఓట్ల లెక్కింపుతో ఫలితం పరిపూర్ణం కానుంది.

ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- నియోజకవర్గంలోని కౌంటింగ్ ఏజెంట్లతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ఈవీఎంలను స్ట్రాంగ్ రూం నుంచి కౌంటింగ్ కేంద్రంలోకి తెచ్చేప్పటి నుంచి .. లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఏజెంట్లు పూర్తి స్థాయి అప్రమత్తతతో ఉండాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సూచించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం కౌంటింగ్ ఏజెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ మంగళవారం ఉదయం 6 గంటలకే ఎన్నికల కేంద్రంలోకి లెక్కింపు ఏజెంట్లు గుర్తింపు కార్డు, 17-సీ ఫారాలు తీసుకుని వెళ్లాలన్నారు. స్ట్రాంగ్ రూం నుంచి ఈవీఎంలు తీసుకొచ్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో కూటమి కుయుక్తులు పన్నే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీకి పడిన ఒక్క ఓటు కూడా వృథా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్‌లో లోపాలు గమనిస్తే వెంటనే ఆర్వో, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని వివరించారు. సర్వేలన్నీ వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నాయని, రాష్ట్రంలోనూ, నియోజవర్గంలోనూ గెలుస్తున్నామని స్పష్టం చేశారు. ముందుగా బ్యాలెట్ ఓట్లు, ఈవీఎం బాక్సుల్లో ఓట్ల లెక్కింపు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైఎస్సార్ సీపీ చీఫ్ ఏజెంట్ ఉపేష్ అవగాహన కల్పించారు. సమావేశంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెంబాబురావు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మండల పార్టీ అధ్యక్షుడు పురుషోత్తమరావు, కళ్ళం విజయభాస్కరరెడ్డి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల పార్టీ కన్వీనర్లు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గొర్రెల కాపరి మృతి



సర్దా తిరుమలయ్య మృతదేహం

క్రోసూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో రోడ్డు మార్జిన్‌లో నిద్రిస్తున్న గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన సోమవారం వేకువ జామున చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఎం.షఫీ తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర మండలం ,గద్దెగూడెంకు చెందిన సర్దా తిరుమలయ్య(42), మరికొందరితో కలిసి మండలంలోని బాలెమర్రు గ్రామం ఊంటూ జీవాలతో వచ్చి చుట్టు పక్కల గ్రామాల్లోని రైతుల పంట పొలాల్లో గొర్రెల ఎరువులు పెడుతున్నారు. రాత్రి వర్షం కురవటంతో గ్రామంలోని తారు రోడ్డు పక్కగా నల్లపట్టా కప్పుకుని నిద్రించాడు. ఈ క్రమంలో వేకువజామున గుర్తుతెలియని వాహనం అతి వేగంగా వస్తూ నిద్రపోతున్న తిరుమలయ్యను ఢీకొట్టి వెళ్లింది. దీంతో తీవ్ర గాయాలతో తిరుమలయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు నరేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం పూర్తి చేయించి కుమారుడికి అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఓపిక ఉన్నవారే ఏజెంట్లుగా రావాలి

- 20 రౌండ్లలో సత్తెనపల్లి ఓట్ల లెక్కింపు
- సత్తెనపల్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ



ఆర్వో మురళీకృష్ణ

సత్తెనపల్లి: సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు నరసరావుపేట సమీపంలోని కాకాని జేఎన్టీయూ కళాశాలలో జరగనుంది. ఈ ఓట్ల లెక్కింపు ఎలా జరగనుంది అనే అంశంపై సోమవారం సత్తెనపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మురళీకృష్ణను సంప్రదించగా 'సాక్షి'తో ముచ్చటించారు.

సాక్షి: సత్తెనపల్లికి సంబంధించి ఓట్ల లెక్కింపు ఎలా జరగనుంది?

ఆర్వో: సత్తెనపల్లి నియోజకవర్గంలో మొత్తం 274 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు మూడు టేబుళ్లు ఏర్పాటు చేశాం. ఈ ఓట్ల లెక్కింపునకు ఆయా పార్టీల ఏజెంట్లు ప్రతి టేబుల్ దగ్గర ఒకరుంటారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు దగ్గర ఒక్కో టేబుల్‌కు ఒక తహసీల్దారు పర్యవేక్షణ ఉంటుంది. ఓవైపు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు జరుగుతుండగా మరోవైపు రెండు వేర్వేరు గదుల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ఈవీఎం ఓట్ల లెక్కింపు జరుగుతూ ఉంటుంది.

సాక్షి: ఓటర్ లెక్కింపు ఎన్ని రౌండ్లు ఉంటుంది?

ఆర్వో: సత్తెనపల్లి నియోజకవర్గంలో మొత్తం 274 పోలింగ్ బూత్‌లు ఉన్నందున 19 రౌండ్లలో 266 పోలింగ్ బూత్‌లు పూర్తవుతాయి. మరో ఎనిమిది పోలింగ్ బూత్‌లు ఉంటాయి. 20వ రౌండ్ లో కేవలం ఎనిమిది పోలింగ్ బూత్‌లు మాత్రమే లెక్కింపు ఉంటుంది. దీంతో మొత్తం ఓట్ల లెక్కింపు పూర్తవుతుంది.

సాక్షి: కౌంటింగ్ ఏజెంట్లకు మీరిచ్చే సలహా ఏంటి?

ఆర్వో: ఆయా రాజకీయ పార్టీలకు సంబంధించిన కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 6 గంటలకు కౌంటింగ్ హాల్లోకి ప్రవేశిస్తే మొత్తం కౌంటింగ్ పూర్తయ్యే వరకు బయటకు వెళ్లడానికి వీలుండదు. మధ్యాహ్న భోజనానికి కూడా కౌంటింగ్ సిబ్బందితో పాటు ఏజెంట్లకు కూడా విరామం ఉండదు. వీలైనంత వరకు బాగా ఓపిగ్గా ఉండగలమనే వారే కౌంటింగ్ ఏజెంట్లుగా హాజరైతే మంచిది. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం తీసుకునేవారు కౌంటింగ్ ఏజెంట్‌గా ఉండడానికి వీల్లేదు.

సాక్షి: ఎంతమంది ఏజెంట్లకు అనుమతి ఉంటుంది?

ఆర్వో: ఒక్కో అభ్యర్థి తరపున ఒక్కో టేబుల్ దగ్గర ఒక ఏజెంట్ మాత్రమే కౌంటింగ్‌కు అనుమతిస్తాం. అంటే ఒక్కో రౌండ్‌కు 14 మంది ఒక అభ్యర్థి తరపున ఉంటారు. వీరే చివరి రౌండు దాక కొనసాగుతారు. వీరికి రిలీవర్ ఉండరు. స్వతంత్ర అభ్యర్థులకు కూడా ఇవే నిబంధనలు వర్తిస్తాయి. ఎమ్మెల్యే అభ్యర్థికి ఎంత మంది ఏజెంట్లను అనుమతిస్తామో ఎంపీ అభ్యర్థి తరపున కూడా అంతే మంది ఏజెంట్లను అనుమతిస్తాం.

సాక్షి: ఓట్ల లెక్కింపు ఎక్కడి నుంచి మొదలవుతుంది?

ఆర్వో: సత్తెనపల్లి మండలం కట్టావారిపాలెం ఒకటో నెంబరు పోలింగ్ బూత్ నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభించి సత్తెనపల్లి రూరల్, సత్తెనపల్లి టౌన్, రాజుపాలెం, నకరికల్లు, ముప్పాళ్ళ, చివర్లో 274 సత్తెనపల్లి టౌన్ రంగా కాలనీ పోలింగ్ బూత్‌తో ముగుస్తుంది. నియోజకవర్గంలో మొత్తం 2,10,500 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోగా వీరిలో పురుషులు 1,03,126 మంది, మహిళలు 1,07,381 మంది, థర్డ్ జెండర్స్ ముగ్గురు ఉన్నారు.

పల్లెలపై ప్రత్యేక నిఘా



పిడుగురాళ్లరూరల్: ఎన్నికలు పూర్తి అయి కౌంటింగ్ ప్రక్రియ రోజున గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తుగా ఎస్పీ మలికా గార్గ్ ఆదేశానుసారం ప్రతి గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. అలజడులకు తావు లేకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. సమస్యాత్మక గ్రామాల్లో ఎలాంటి గొడవలు లేకుండా ప్రతి సన్నివేశాన్ని చిత్రీకరించేలా చార్టర్ డ్రోన్‌లను ఉపయోగిస్తున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... కౌటింగ్ రోజున బయటకు వచ్చి ఎలాంటి అల్లర్లు సృష్టించిన, సంబరాలు నిర్వహించినా, డ్రోన్ వీడియోలో కనిపిస్తే జైలు పాలవుతారన్నారు. గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగించినా, పోలీసుల విధులకు ఆటంకం కలిగించినా కఠిన చర్యలు తప్పవని అన్నారు. అనంతరం కరాలపాడు గ్రామంలో చార్టర్ డ్రోన్ ఉపయోగించి, దాని పనితీరును పరిశీలించారు.

నిర్మానుష్యంగా మారిన గ్రామాలు



నిర్మానుష్యంగా మారిన రహదారి

రొంపిచర్ల : మండలంలో గత మూడు రోజులుగా పల్నాడు జిల్లా పోలీసు శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రశాంతంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. దీంతో మండలంలో అన్ని గ్రామాలలో పోలీసులు తిరుగుతూ షాపులను, హోటళ్ళను, టీస్టాళ్ళను మూసివేశారు. దీనివల్ల మండలంలో అన్ని గ్రామాలలో అన్ని రకాల షాపులు మూతబడటం వలన నిర్మానుష్యంగా మారినాయి. ఈ నెల 4న ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా సోమవారం మండలంలో అన్ని గ్రామాలలో 144 సెక్షన్ కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు. ఎస్‌ఐ కె.పి.రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు అన్ని గ్రామాలలో తిరుగుతూ 144 సెక్షన్ అమల్లో ఉందని, గ్రామస్తులు సహకరించాలని కోరుతున్నారు. గ్రామాలలో ఈ మేరకు పోలీసులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాలలోకి వస్తున్న వాహనములను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాటిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారు.